ఎట్టి యభ్యంతరమును పెట్టలేదు. పయిగా, వా రందరూ లక్ష్మిబాయిచేసిన ఏర్పాటులను చాలాసంతోషంతో ఆమోదించేరు! వారి వుద్దేశాన్ని అనుసరించి లక్ష్మిభాయి తానొకనాడు, రతీకాంతునితో కలిసి వానియింటికిపోయి, ఆయపరిచితస్త్రీని చూడాలని అనుకుంది.

శాంతిశిబిరంలో అందరూ సరదాగా కూర్చుని మాట్లాడుకుంటూంటే అక్కడికి మాధవరావు వచ్చేడు; మాటలసందర్భమున శీల వతిని మాధవరావునకిచ్చి పెండ్లిచేయుట కేర్పాటు జరిగినదని రతీకాంతుకు తెలిసికొనెను!

మాధవరావు తండ్రి, నారాయణరావ్ గారూ, రతీకాంతరావూ, చచ్చిపోయిన అమరేంద్రినాదుడూ, అంతాకూడా చిన్నప్పుడు కలిసి చదువుకున్నారు, నారాయణరావుగారికి అమరేంద్రుని గురించి ఏమీ తెలీదు; అందుచేత మాధవరావుని ఆవిషయమై అడిగితే లాభంవుంటుందని, రతీకాంతు డనుకున్నాడు.

ర:—మాధవా, నువ్వెప్పుడయినా అమరేంద్రినాధుడనే వానిని చూసేవా?

మా:—అమరేంద్రినాధుడా? ...ఎవరు?

ర:—మీ బాబయ్య గారితో చదువుకున్నాడు; మేమంతా చిన్నప్పుడు స్నేహితులం; వానిని నువ్వు ఎరుగుదువా?

మా:—అతడా? నల్లగా, అందంగా వుంటాడు కాదూ?... ...అవును యీమధ్యనే వానిని ఎక్కడో చూసినట్లు జ్ఞాపకం.

ర:—ఆ, అతడే! వానిభార్యా పిల్లలూ అంతా ఎక్కడున్నారో తెలుసూ?

మా:—ఊహు! ఆసంగతి నాకు తెలీదు.

ర:—పోనీ, ఆఖరిసారి, వానినెక్కడచూసేవు?

మా:—జ్ఞాపకం చాలదు.

*   *   *   *

లక్ష్మిభాయి, రతీకాంతునితో కలిసి, ఆయపరిచితస్త్రీని చూడ్డానికి వానియింటికి వెళ్ళింది.

[సశేషం]

## చుట్టంపట్లు తప్పలేదు

డబ్బీరు సత్యనారాయణరావుగారు.

ఆతడు రిటైర్డు తహసీలుదారు. మొదటిభార్య చుక్కలపాలెం వక్కలమ్ముకుండే టందుకు పోయింది. అందుచే ఏభై యైదవయేట(55)ముద్దుముద్దుగా ముప్పదివందలూ పోసి మనసుపడి మురిపెంపుపిల్లను పెళ్ళిచేసుకొన్నాడు. కాని ముట్టుకోటానికి నోపెర్మిషన్. అయితే యెందుకు? దూరంనుంచి చూసి సంతోషించడానికి. ఫోర్సు చేస్తే, వెన్నెల వెదజల్లడం మానేసి వేడినిప్పులు వెదజల్లుతోంది. మల్లెపువ్వు వంటి నేత్రములు మందారపువ్వులుగా మారుతాయి. అంతకోపం జాస్తి తహసీలుదారుగారి భార్యకు. పదునేడువత్సరముల ప్రాయముగల పూబోడి. నవనాగరకతా ప్రపంచములో మందమంద యానంతో నడయాడే హంసయాన. అటువంటిస్త్రీని వేరుగా వర్ణించి పుటలు నింపటం నిష్ప్రయోజనం. కాబట్టి ఒక్కమాటలో ప్రస్తుత నవనాగరిక చలాకీపురుషుని హృదయభావాల్లో పిల్లని ఏలా యిమాజిన్ (చిత్రించు) చేసుకొంటాడో ఆలా అప్ టు డేట్ ప్యాషన్‌లతో రాజిల్లుతూంటుంది. ఈమె అలంకారాలకి ఆయన పింఛను సరిపోతుంది. ఆడదాని కామాత్రం స్వాతంత్ర్యమయినా వుండాలి అన్నారు యిప్పటి నవనాగరికులు. లేక

పోతే దేశం రాణించదు. కాలాన్నిపట్టి మనుష్యులు మారాలన్నారు గాంధీగారు. ఆత్మస్వాతంత్ర్యంతోటి అవయవ స్వాతంత్ర్యము కంటాక్ట్ (గుత్తకు) చేయుమన్నారు మహాత్ములు. అప్పుడుగాని బాగుపడదు ప్రపంచకం. నాగరకతకు ప్రథమసోపానమదే.

అప్పారికొక డ్రామా వచ్చింది. డ్రామాకు కాంప్లిమెంటరీ టిక్కెట్టు వచ్చింది తహశీలుదారుగారికి. పేపర్లు పంచిపెట్టుకుంటూ వస్తూన్నకుర్రవాడొకడు అరుగుమీద నిలబడియున్న తహశీలుదారుగారి భార్యకు "ఇదిగోండి అమ్మగారు పేపరు" అంటూ క్రిందనుంచి అందివ్వగా, వయ్యారంగా అందుకోటంలో జారిన పయిటన్నా చూచుకోలేదు. ఆరోజు సాయంత్రం ముస్తాబయింది డ్రామాకుగాను. "గ్రహరాజు నిజకాలగతులుదప్పినా" మన తహశీలుదారుగారికాంత తప్పుతుందా డ్రామాకి వెళ్ళటం. అందుకుగాను ముస్తాబు. ఆముస్తాబు కొంచెం వర్ణిస్తా. ఎందుచేతంటారా? స్త్రీ గాదటండీ! అందుచేత స్త్రీగాని సందర్భమయితే "కవి" విధి వర్ణించడమే. అయినా నేను ప్రబంధకవిని గాను. అల్లసాని పెద్దనవలె అంగానికి 60 పద్యాలంటగట్టి ఘళఘళధ్వనులతో వరూధినినివర్ణించేలాగ. టూకీగా—పక్కపాపిడితీసి వాల్జడేసి రిబ్బనువేసి కుట్టిన జారుబాడీ రవికతొడిగి సన్నని పార్శీలేసంచు చీర గట్టి నడుముకి రవ్వలొడ్డాణం తగిలించుకొని అరేబియన్ మేకీలాగ తయారయింది. రాత్రి 9 గంటలయింది. ఇంటికి జట్కావచ్చింది. తహశీలుదారుగారికి తలనొప్పిగా వుండడంచేత డ్రామాకి వెళ్ళ నిశ్చయించుకోలేదు. భార్య కాంతం ఒక్కర్తే బయలుదేరింది డ్రామాకి. డ్రామా పెండాలునకు జట్కావచ్చి ఆగింది. కాంతం జట్కాదిగి ఫిమేల్సుగేటులో ప్రవేశించింది. అప్రయత్నంగా ఆడియన్సుకళ్ళు ఆమెవైపుకు తిరిగాయి. కొంత మంది చూడకుండా వుండాలని ప్రయత్నపడ్డారు "తుమ్మెదకును గంధసింధుర మదధారగాలిసోక మనసు చెదరదా! గోళ్లగాచనదా? తప్పా?" అని మనసు నిశ్చయించుకొని తిరిగి కూర్చుండేదాకా చూడటం ప్రారంభించారు. డ్రామా మొదలుపెట్టారు...... రాత్రి 12 గంటలకు తహసిల్ దారుగారింటికి చుట్టం వచ్చాడు. కుర్రవాడు. పదునైదు సంవత్సరముల ప్రాయం. చలాకీ యెక్కువ. తహశీలుదారుగారికి మేనల్లుడు. తహాసీలుదారుగారు లేచి మేనల్లుడొచ్చినందుకు చాలా సంతోషించి తాను మామూలుగా పండుకొన్న మంచంపైనివేసి పండుకోమన్నాడు మేనల్లుని. తాను మామూలుగా యింటిలో పండుకొన్నాడు. చుట్టంకుర్రాడు అగ్నిహోత్రం శాలువ ఆపాదమస్తకం కప్పుకొని పడుకొన్నాడు దోమలబాధపడలేక. రాత్రి సుమారు 2½ గంటల టైము కావచ్చింది. డ్రామానుంచి తహశీలుదారుగారిభార్య కాంతం వచ్చింది. బడలిక యెక్కువగా యుండుటచేత నిద్రమత్తు యెక్కువగుటచేత పార్శీలేసంచు చీర విప్పకుండానే మామూలు తహశీలుదారుగారు పండుకునే మంచమే ననుకొని నిస్సందేహంగా మేనువాల్చిందిపక్కనే.

.........................

తొలిజామునే లేచింది యింటిపనులు నవరించుకొందామని తహసీలుదారుగారు చుట్టాన్ని లేపి స్నానానికి కాలవకి తీసుకువెళ్ళాడు. మన వాడిది గాడ్ ఫియరింగు నేచర్. ఎంత తప్పుచేసాంరా అని భయపడ్డాడు. భయపడుతూనే చేసాడు స్నానం. దోషపరిహారార్థం మరి[illegible]డు పర్యాయములు యెక్కువగా స్నానంచేసాడు. త

పతివ్రతకి దేవుని ప్రార్థించాడు. తహశీలుదారుగారు చుట్టాన్ని వెనక వేసుకొని యింటికొచ్చాడు. "వీరెవరండీ" అంది కాంతం చుట్టం కురార్రీ చూచి. "మేనల్లుడే" అన్నాడు తహశీలుదారుగారు "ఎప్పుడొచ్చారేమిటండీ" అంది కాంతం చుట్టంతో. చుట్టానికి దడపట్టుకుంది "రాత్రి వచ్చానండీ" అన్నాడు చుట్టం. "మాయిల్లు పావనం అయిందండీ" అంది కాంతం. ఆఖరుమాట వినేసరికి చుట్టానికి పంచప్రాణాలు పోయాయి. ఏం కొంప మునుగుతుందో అని. ఇష్టదేవతని ప్రార్థించుకొంటున్నాడు. "రాత్రి వచ్చాడే" అన్నాడు తహశీలుదారుగారు "అవునుగాని నీవు రాత్రి డ్రామాకి వెళ్ళి యెప్పుడేంటి రావటం? జాడాజబాబు లేదు" అన్నారు తహశీలుదారుగారు కాంతంతో అయిరానికల్ గా మాట్లాడుతున్నా రనుకొని ఒహో చిరునవ్వు నవ్వింది కాంతం. భోజనానికి లేవమంది కాంతం ఇద్దరూ లేచారు పీటలమీద కూర్చున్నారు రాత్రి దోమలు కుట్టడంచేత వంటినిండా చుట్టానికి దద్దుర్లు కనబడుతున్నాయి చుట్టాన్ని చూచి కాంతం "వంటినిండా దద్దుర్లేమిటండి" అంది "మీయింటికోమలు" అన్నాడు చుట్టం. "రాత్రి యెక్కడ పండుకొన్నారేమిటి?" అందికాంతం. బయట నుంచంమీద" అన్నాడు చుట్టం నెమ్మదిగా. ఆమాట వినేసరికి కాంతం అదరిపడింది. "ఆఫ్టర్ డెత్ డిడాక్టర్" అయిపోయిందానికి విచారిస్తే లాభంలేదనుకొంది చుట్టంపట్ల తప్పులేదనుకొని ఒహో చిరునవ్వునవ్వింది చుట్టంకేసిచూస్తూ. మేనల్లుణ్ని కాబట్టి తప్పులేదనుకుంటూ తన ఆమోదమును మందహాసంద్వారా చూపాడు చుట్టం కాంతపట్ల.

---

## అందుకు సందేహమా?

ఆదుర్తి సీతారామచంద్రరావుగారు.

రమేశం మొగలియారు చేతిసంచి తగిలించుకొని మైసూరు రైల్వేస్టేషనుకు వచ్చెను. చెన్నపురికి టికెట్టు తీసికొని రైలెక్కెను మైసూరు నుండి రైలు బయలుదేరెను. మధ్యాహ్నము 12 గంటలయింది. మండు వేసవికాలము. రైలులోని వారందరు ఎండవేడిమియొక్క చెమటచే బాధపడలేక ఫాన్సుతో విసరుకొనుచుండిరి. రమేశం ధూమశకటారోహణాంతరమున చెమట పోయుచుండుటచే తానుధరించిన చొక్కాను తీసి దగ్గిరయుంచుకొనెను. బనియను మాత్రము తీయలేదు. శరీరము నల్లత్రాచుపాము రంగును పోలియున్నది. అతను ధనవంతుడైనను వదనము మాత్రము నల్లనిదై సౌందర్యవిహీనమై స్ఫోటకపుమచ్చలుగలిగి చూచుటకు వికారముగా యుండెను. అతని సౌందర్య మెట్లున్నను ఇప్పటి నవనాగరికా పద్ధతిలో యారితేరినవాడని చెప్పక తప్పదు.

తెనుగు నేర్చుకొనుటకై రమేశం చెన్నపురి పోవుచుండెను. ఆంగ్లేయవిద్య మూడవఫారము వరకు చదివి మూడు దండయాత్రలుకొట్టి అంతటితో మానుకొనెను. రైలు చెన్నపురి సెంట్రలు స్టేషనులో యాగింది. పత్రికలమ్మువారు "భారతి, గృహలక్ష్మి, వినోదిని, నెరజాణ" అని కేకలువేయుచుండిరి. రమేశం ఒక నెరజాణపత్రిక కొని చదువుతూ సెంట్రలుస్టేషనులో నిలువబడ్డాడు. ఒక రిక్షాబండివాడు రమేశం చేతులుపట్టు